## క్లుప్తంగా

### పారిశుద్ధ్యం, తాగునీటికి అధిక ప్రాధాన్యం



ఇబ్రహీంపట్నం: కొండపల్లి పట్టణంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మునిసిపల్ కమిషనర్ సీహెచ్. వెంకటేశ్వర్లు తెలిపారు. మునిసిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఎన్టీటీపీఎస్ రోడ్డు, గాజులపేట, నందనం అపార్ట్‌మెంట్, ఖాజీమాన్యం తదితర ప్రాంతాల్లో డస్ట్ బిన్‌ల్లో చెత్తను తొలగించారు. వీధులను శుభ్రం చేశారు. సేకరించిన చెత్తను ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు. తాగునీటి సరఫరా పరిశీలించారు.

### అబుల్ కలాంకు నివాళి



కాచవరం(ఇబ్రహీంపట్నం): గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. అబుల్ కలాం దేశానికి చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్న బిరుదు ఇచ్చి గౌరవించిందని ఉర్దూ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషా తెలిపారు. కలాం జయంతిని పురస్కరించుకుని ఏటా నవంబర్ 11వ తేదీన జాతీయ విద్యా దినంగా జరుపుకొంటున్నామని వివరించారు. హెచ్‌ఎం నాగ మల్లేశ్వరి పాల్గొన్నారు.

### ఆర్థిక సహాయం అందజేత



ఎ.కొండూరు: మండలంలోని పోలిశెట్టిపాడు పీఏసీఎస్ పరిధిలోని గ్రామాల్లో అనారోగ్యం, ప్రమాదాల కారణంగా సంఘ సభ్యులు ఎవరైనా మరణిస్తే సహకార సంఘం తక్షణ సహాయం అందజేస్తుందని సొసైటీ చైర్మన్ తుమ్మూరు వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. పోలిశెట్టిపాడు గ్రామానికి చెందిన పీఏసీఎస్ సంఘ సభ్యుడు కె.జమలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతని కుటుంబానికి సహకార సంఘం, కేడీసీసీ బ్యాంకు తరఫున రూ.10 వేల ఆర్థిక సాయం అందించామని వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. పీఏసీఎస్ సీఈఓ పి. కోటేశ్వరరావు, సూపర్‌వైజర్ ఎన్.వి.సుబ్బారావు పాల్గొన్నారు.

### పెరుగుతున్న వర్మీకంపోస్ట్ విక్రయాలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని జూపూడి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఉత్పత్తవుతున్న వర్మీకంపోస్ట్ విక్రయాలు పెరుగుతున్నాయని పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు తెలిపారు. బుధవారం ఒక్క రోజే 400 కిలోలు విక్రయించామని పేర్కొన్నారు. రూ.10 చొప్పున విక్రయించగా రూ.4 వేల ఆదాయం వచ్చిందని వివరించారు. ఏడాది కాలంగా పూర్తిస్థాయిలో వర్మీకంపోస్ట్ తయారు చేస్తుండగా ఇప్పుడిప్పుడే కొనుగోలు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. వర్మీ కంపోస్ట్ వాడకంతో పొలాల్లో భూసారం పెరుగుతుందన్న నమ్మకం రైతులకు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



మైలవరం: మండలంలోని పొందుగల గ్రామానికి చెందిన సంకటి జోగి మృతి చెందారు. మట్టి ఖర్చుల నిమిత్తం అతని భార్య మెర్సీకి వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు గుగులోతు రాంబాబు, ఇస్లావత్ స్వామి, మాజీ సర్పంచ్ డొంకెన చలపతి రావు తదితరులు పాల్గొన్నారు.

### రేపు ఎస్టీ కమిషన్ చైర్మన్ రాక

నూజివీడు: ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు ఈ నెల 24న నూజివీడు మండలం ఓగిరాల తండాలో పర్యటించనున్నారని గిరిజన సంఘం నాయకుడు జగన్నాథం వాకిలయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆయన గిరిజనులతో ముఖాముఖి నిర్వహించి, వారి సమస్యలపై చర్చిస్తారని పేర్కొన్నారు. అనంతరం నూజివీడు ట్రిపుల్‌ఐటీని సందర్శిస్తారని వెల్లడించారు.

# యాజమాన్య పద్ధతులతో మామిడి పూతకు రక్ష

మైలవరం: యాజమాన్య పద్ధతులతో మామిడి పూత, పిందె రాలడాన్ని అరికట్టవచ్చని ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో మామిడి తోటలు 53 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. మైలవరం మండలం, పరిసర ప్రాంతాల్లోని మామిడి తోటలు పూత, పిందె దశలో ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో పూత, పిందె రాలు సమస్య కనిపిస్తోంది. దీంతో రైతులు దిగుబడులపై ఆందోళన చెందుతున్నారు. నల్లి, పుల్ల విరుపు, బూజు, ఆకుపై నల్ల తెగులు ఆశించడంతో ఆకులు మాడిపోతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. గతంలో ఎకరాకు ఐదు నుంచి పది క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేదని తెలిపారు. ప్రస్తుతం పూత, పిందె రాలడంతో ఐదు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మామిడిలో పూత, పిందె రాలు సమస్యను సరైన యాజమాన్య పద్ధతులతో నివారించవచ్చని ఉద్యాన శాఖ మైలవరం మండల ఇన్‌చార్జి అధికారి సొహైల్ అహ్మద్ తెలిపారు. చీడపురుగు, నీటి ఎద్దడి, వాతావరణం పరిస్థితులు, హార్మోన్ల లోపం తదితర కారణాల వల్ల పూత, పిందె రాలుతుందని వివరించారు. ఈ దశలో పేను, తేనె మంచు పురుగు నివారణకు థయోమిథాక్సామ్ మందును 0.5 గ్రాములను లీటరు నీటికి వేప నూనెతో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మచ్చ తెగులు, బూడిద తెగులు నివారణకు లీటరు నీటికి ప్రోపినెబ్ రెండు గ్రాములు కలిపి ఆ ద్రావణాన్ని పిచికారీ చేయాలని పేర్కొన్నారు. మామిడి పిందెకట్టు నుంచి కాయ పెరిగే దశ వరకు కనీసం రెండు నీటి తడులు ఇవ్వాలని సూచించారు. తడులతో పాటుగా ప్రతి చెట్టుకు కిలో యూరియా, అర కిలో పొటాష్ వేస్తే పిందె రాలటం ఆగి దిగుబడి బాగా పెరిగుతుందని వివరించారు. కేవలం వర్షాధారంగా సాగు చేసే తోటల్లో మల్టీ-కే (13:00:45) లీటరు నీటికి పది గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ యాజమాన్య పద్ధతులు పాటించినా పిందె రాలడం ఆగకపోతే హార్మోన్ల లోపంగా గుర్తించి నాఫ్తలీన్ ఆసిటిక్ ఆసిడ్ 2.5 మిల్లీలీటర్లు పది లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.



మైలవరంలో పూత, పిందెలతో ఉన్న చెట్టు



మైలవరంలోని మామిడి తోటలో రాలిన మామిడి పిందెలు



రాలిన మామిడి పిందె

# వైఎస్సార్ సీపీతోనే ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు
- వైఎస్సార్ సీపీలో చేరిన తెలుగుదేశం పార్టీ నాయకులు



ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన యనమదలకు చెందిన టీడీపీ నాయకులు

నూజివీడు: వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు కృషిచేయాలని కోరారు. నూజివీడు మండలం యనమదలకు చెందిన టీడీపీ నాయకులు అర్జా ప్రకాష్, అర్జా నవీన్, గురజ కనక రాజు, బొట్టు హరీష్, అర్జా వినోద్, అర్జా సురేష్‌తో పాటు 50 మంది టీడీపీ నుంచి ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు సమక్షంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారందరికీ వెస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే వివరించారు. నియోజకవర్గంలో దాదాపు 12 వేలాది మందికి నివేశన స్థలాలు ఇచ్చి గృహాలను నిర్మిస్తోందన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, యనమదల సర్పంచి వరికూటి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు చింతా వడ్డీ కాసులు, గృహ సారథుల మండల కన్వీనర్ గుడిమళ్ల రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఉపవాస దీక్ష ప్రారంభం

చాట్రాయి: క్రీస్తు విశ్వాసులు బుధవారం ఉపవాస దీక్షలు చేపట్టారు. చనుబండ ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ మద్దాల జోసఫ్, కోటపాడు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ పి.జయరాజు, చాట్రాయి ఆర్‌సీఎం చర్చి ఫాదర్ చౌటపల్లి ప్రశాంత్ ఉవాస దీక్ష తీసుకున్నవారితో మాలధారణ చేయించారు. సీఎస్‌ఐ చర్చిల్లో కూడా ఉపవాస ప్రార్థనలు చేపట్టారు.

**ఆగిరిపల్లిలో..**

ఆగిరిపల్లి: క్రైస్తవ ఉపవాసదీక్షలు బుధవారం నుంచి ప్రారంభమైనట్టు కనసానపల్లి పరిశుద్ధ పౌలు సీఎస్‌ఐ చర్చి ఫాదర్ కొల్లూరి ఐజక్ జాన్ తెలిపారు. పలువురు విశ్వాసులు ఉపవాస దీక్ష చేపట్టారు.

**ఉపవాస దీక్షల ప్రారంభం**

తిరువూరు: స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ఉపవాసదీక్షలను బుధవారం ప్రారంభించారు. చర్చి ఫాదర్ రెవరెండ్ విజయకుమార్ నేతృత్వంలో 200 మంది ఈ దీక్షలు చేపట్టారు. మాలధారణ అనంతరం విజయ కుమార్ వాక్యోపదేశం చేశారు. దీక్షా కాలంలో సేవా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు.



చనుబండలో మాలధారణ చేస్తున్న ఫాదర్ జోసఫ్

**చిట్టేలలో..**

తిరువూరురూరల్: మండలంలోని చిట్టేల సీఎస్‌ఐ స్కూలులో ఉపవాస దీక్షలను బుధవారం ప్రారంభించారు. ఉపవాస దినాల్లో పాటించాల్సిన నియమ నిబంధనలను తిరువూరు నియోజకవర్గ క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షుడు గంటా జయంత్ బాబు, సీఎస్‌ఐ తిరువూరు డీనరీ చైర్మన్ పరిశుద్ధ రావు సంఘస్తులకు వివరించారు.

# గడప గడపకు సంక్షేమ లబ్ధి

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

రెడ్డిగూడెం: కులం, మతం, పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రమాణికంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని మద్దులపర్వ సచివాలయ పరిధిలో ఆయన బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు ఎమ్మెల్యేకు హారతులతో స్వాగతం పలికారు. మ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఇంటింటికీ వెళ్లి మూడున్నర ఏళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల మరమ్మతులను కూడా టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధన్యం ఇస్తూ మన బడి నాడు-నేడు కింద కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతోందని వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయ భాస్కరరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బలగాని తిరుపతి రావు, రెడ్డిగూడెం మండల సచివాలయ కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, మద్దులపర్వ ఎంపీటీసీ సభ్యులు మరీదు ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

నూజివీడు: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పిలుపునిచ్చారు. నూజివీడు మండలంలోని గృహసారథులకు, సచివాలయ కన్వీనర్లకు బుధవారం ఎమ్మెల్యే స్థానిక కార్యాలయ ఆవరణలో శిక్షణ ఇచ్చారు. జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, విద్యా మౌలిక సదుపాయాల సంస్థ డైరెక్టర్ కలగర వెంకటేశ్వరరావు, గృహసారథుల మండల కన్వీనర్ గుడిమళ్ల రామస్వామి, సీనియర్ నాయకులు బసవరాజు నగేష్ తదితరులు ప్రసంగించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పోలిమెట్ల శివ, వైస్ ఎంపీపీ అక్కినేని శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాన్ని తనిఖీచేసిన ఎంపీడీఓ

విస్సన్నపేట: నరసాపురం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ బుధవారం అకస్మికంగా పరిశీలించారు. సచివాలయం అందిస్తున్న ప్రభుత్వ సేవలకు సంబంధించిన రికార్డులు సక్రమంగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. సమయపాలన తప్పక పాటించాలని ఆదేశించారు.

## ఉత్సవాలు ప్రారంభం

ఆగిరిపల్లి: మండలంలోని పిన్నమరెడ్డిపల్లి శివారు రాజవరంలో బుధవారం రాజవర ప్రసాదమాత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం రాజవర ప్రసాదమాత తేరు ఊరేగింపు నిర్వహించారు. రాత్రికి దివ్య పూజాబలిని ఆగిరిపల్లి ఎంఎస్ఎఫ్ఎస్ సహాయ విచారణ గురువు ఫాదర్ జి.కిరణ్ నిర్వహించి విశ్వాసులకు సందేశం అందించారు.

## విద్యుత్ డీఈగా రామకృష్ణ

తిరువూరు: తిరువూరు సబ్ డివిజన్ విద్యుత్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పి.రామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నూజివీడు డీఈఈగా పనిచేస్తున్న ఆయన బదిలీపై తిరువూరులో నియమితులయ్యారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న పోతురాజు నూజివీడుకు బదిలీ అయ్యారు.

# విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

మైలవరం: విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని ఏపీ ఎస్ఎస్‌డీసీ చైర్మన్ కె.అజయ్‌రెడ్డి సూచించారు. మైలవరంలోని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్మించిన మూడు భవనాలను బుధవారం ప్రారంభించారు. స్థానిక ఇంజినీరింగ్ కళాశాలతో సమానంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తీర్చిదిద్దాలని, మౌలిక వసతులతో సరితూగేలా కళాశాల వెలుగొందాలని ఆశిస్తున్నామని అజయ్‌రెడ్డి అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థల దాత, ప్రవాసాంధ్రుడు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి మాట్లాడుతూ.. కళాశాల యాజమాన్యం తరగతి గదుల సమస్య ఉందని తన దృష్టికి తీసుకొచ్చిన నేపథ్యంలో రూ.2.25 కోట్లతో తరగతి గదులు, ఆడిటోరియం నిర్మించామని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి ఎల్‌బీఆర్‌సీఈ వ్యవస్థాపక చైర్మన్ లకిరెడ్డి బాలిరెడ్డి కుమారులు విక్రమ్, సిద్ధార్థకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మైలవరం ఏసీపీ ఎం.రమేష్ నూతనంగా నిర్మించిన బస్టాండ్‌ను ప్రారంభించారు. ఏపీ ఎస్ఎస్‌డీసీ జనరల్ మేనేజర్ గోపీనాథ్ రెడ్డి, ఈడీ కె.దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కళాశాల అభివృద్ధికి సహకరిస్తున్న డాక్టర్ హనిమిరెడ్డిని ఈ సందర్భంగా విద్యాదాన శిరోమణి బిరుదుతో ఘనంగా సత్కరించారు.



డాక్టర్ హనిమిరెడ్డిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

# జాతీయ రహదారి పనుల పరిశీలన

జి.కొండూరు: ఖమ్మం నుంచి విజయవాడ వరకు నిర్మించనున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. జి.కొండూరు మండల పరిధిలో హైవే ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు సరిహద్దు రాళ్లను ఏర్పాటు పనులను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. అనంతరం చెర్వుమాధవరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయంలో ప్రజలకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. రేషన్ కార్డుల విభజన ప్రక్రియ జరుగుతున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయ పరిధిలో పక్కా గృహాల నిర్మాణాల తీరుపై ఆరాతీశారు. సిబ్బంది పని తీరును మెచ్చుకున్న జాయింట్ కలెక్టర్ విజిటర్ లిస్టులో సిబ్బందిని అభినందిస్తూ తన సందేశాన్ని రాసి వెళ్లారు. తహసీల్దార్ రోహిణీదేవి, ఎంపీడీఓ అనూరాధ, ఆర్ఐ సర్వేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్

## పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు

జి.కొండూరు: స్థానిక శాగం శివరామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను నందిగామ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి గౌరీశంకర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు, లెసన్ ప్లాన్‌లు, డైరీలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ మాట్లాడుతూ.. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చి దిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. హెచ్‌ఎం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఉప విద్యాశాఖాధికారి గౌరీశంకర్

## రామపాదుకలకు విశేష పూజలు

గంపలగూడెం: హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా అయోధ్య నుంచి తోడ్కొని వచ్చిన రామ పాదుకలకు మేడూరు ఆంజనాద్రి వెంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీ వీరాంజనేయస్వామి ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవస్థానాల అర్చకులు బాదంపూడి శివరామలింగ ప్రసాద్, కె.రామచంద్రచార్యులు, ఆంజనేయాచార్యులు ఆధ్వర్యంలో పాదుకలకు పంచామృతాలతో అభిషేకం, వివిధ పుష్పాలతో అర్చన చేశారు. అనంతరం పాదుకలను గంపలగూడెం సీతారామచంద్ర స్వామి ఆలయం వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా గోవిందమాల గురుస్వామి గ్యారా గోపాల్, అయోధ్యకు చెందిన అర్చకుడు శ్రీనివాసశాస్త్రి, మేడూరు అంజనాద్రి దేవస్థానం అధ్యక్షుడు ముత్యాల వెంకటేశ్వరరావు, వీరాంజనేయ దేవస్థానం చైర్మన్ ముత్యాల రామకృష్ణ, గంపలగూడెం రామాలయం వైస్ చైర్మన్ కోదండరాం తదితరులు పాల్గొన్నారు.

## 1న ఆలయ పునఃప్రతిష్ట

తిరువూరు: పట్టణంలో పునర్నిర్మించిన శ్రీరాజ్యలక్ష్మి సమేత రంగనాయకస్వామి దేవస్థానంలో మార్చి ఒకటో తేదీన విగ్రహాల పునఃప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందని ఆలయ ధర్మకర్త దారా రంగారావు బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9.18 గంటలకు రంగనాయకస్వామి, రాజ్యలక్ష్మీదేవి, లక్ష్మీ నరసింహస్వామి, గోదా, కృష్ణ పరమాత్మ, గరుడాంజనేయ విగ్రహాలు, జీవ ధ్వజ విమాన, శిఖర, ఆళ్వార్ల విగ్రహాల పునఃప్రతిష్టను వేదపండితులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి పునఃప్రతిష్ట కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. విగ్రహాల ప్రతిష్ట అనంతరం భక్తులకు అన్న సంతర్పణ చేస్తామని తెలిపారు.



పునర్నిర్మించిన రంగనాయక స్వామి దేవస్థానం

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తిరువూరురూరల్: మండలంలోని ఆంజనేయపురంలో సీసీ రహదారి నిర్మాణ పనులను ఎంపీపీ గద్దల భారతి బుధవారం ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించే చర్యల్లో భాగంగా ఎమ్మెల్యే రక్షణనిధి సీసీ రహదారులను మంజూరు చేశారని ఎంపీపీ తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, సర్పంచి మామిడి కుటుంబరావు, ఎంపీటీసీ సభ్యురాలు కోటేశ్వరమ్మ, పీఏసీఎస్ చైర్మన్ ముక్కామల సీతారామయ్య పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణ పనుల తనిఖీ

తిరువూరు: నగర పంచాయతీలో చేపట్టిన సీసీ రహదారుల నిర్మాణ పనులను మునిసిపల్ కమిషనర్ బాలకృష్ణ బుధవారం తనిఖీ చేశారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణం జరపాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కట్టలేరు పంపింగ్ స్కీం నుంచి పైపులైన్ల లీకేజీ లేకుండా మరమ్మతులు చేయాలని ఆదేశించారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

విస్సన్నపేట: మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ తెలిపారు. సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

## నేడు పుట్రేలలో గడప గడపకు మన ప్రభుత్వం

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామ సచివాలయం-2 పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే రక్షణనిధి ఉదయం ఎనిమిది గంటల నుంచి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తారని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిదులు పాల్గొనాలని సూచించారు.

## బాధిత కుటుంబానికి బీమా పరిహారం అందజేత

గంపలగూడెం: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సభ్యుడైన యాసారపు వీరస్వామి ఇటీవల మృతి చెందారు. ఆయనకు మంజూరైన బీమా నగదు రూ.లక్షను అతని భార్య సావిత్రికి కేడీసీసీ బ్యాంకు మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు పెమ్మిరాజు ఆంజనేయులు బుధవారం అందజేశారు. సంఘ సభ్యుడైన షేక్ జాన్ అహ్మద్ మృతి చెందగా మట్టి ఖర్చుల నిమిత్తం అతని కుమారుడు కరీమ్‌కు రూ.10 వేలు అందజేశారు. సొసైటీ సీఈఓ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కె.నరసింహారావు, ఎ.కృష్ణారెడ్డి, పి.హరికృష్ణ పాల్గొన్నారు.

## ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ముసునూరు: మహా శివరాత్రి మహోత్సవాల ముగింపు అనంతరం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బలివే ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేశారు. సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్ ఆధ్వర్యంలో 200 మంది పారిశుద్ధ్య కార్మికులతో బుధవారం పనులు చేపటఆటరు. బలివే ఆలయం, ఉత్సవ ప్రాంగణం, తాత గుడి వీధి, గ్రామ ప్రధాన వీధులు, సచివాలయం, పాఠశాల ఏరియాల్లో పారిశుద్ధ్య పనులు కొనసాగాయి. పంచాయతీ కార్యదర్శి జంగం యోహాన్ గ్రామంలోని అన్ని వీధుల్లో హైపో క్లోరైట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు.

## • ఆత్మీయ కలయిక



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ మైలవరం పరిశీలకుడు పడమట సురేష్‌బాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో సురేష్‌బాబు తల్లి పడమట సావిత్రి, మేనల్లుడు ఈదా రాకేష్ ఉన్నారు. – లబ్బీపేట(విజయవాడతూర్పు)

# స్నాన ఘాట్ నిర్మాణానికి స్థల పరిశీలన

చాట్రాయి: స్థానిక ఉమా రామ లింగేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న పెద్ద చెరువులో భక్తులు స్నానమాచరించేందుకు ఘట్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ప్రతి సంవత్సరం శివరాత్రికి వచ్చే భక్తులు స్నానం చేసేందుకు ఇబ్బందులు పడుతుండడంతో గ్రామస్తులు, ఆలయ కమిటీ అభ్యర్థన మేరకు బుధవారం ఎంపీడీఓ ఎస్ మురళీమోహన రావు స్థల పరిశీలన చేసి, అంచనాలు తయారు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.